- విద్యుద్దీపాలతో రాజన్న ఆలయం ముస్తాబు
- రూ.3 కోట్లతో ఏర్పాట్లు
- ఉచిత పాస్‌లు రద్దు, రూ.300తో వీఐపీ దర్శనాలు
- బందోబస్తుకు 1400 మంది పోలీసులు
- శివార్చనతో సాంస్కృతిక కార్యక్రమాలు
- ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- నేటి నుంచి వేములవాడలో మహాశివరాత్రి జాతర



విద్యుద్దీపాల వెలుగులో వేములవాడ రాజన్న ఆలయం

'మహా' జాతరకు సర్వం సిద్ధం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మహాశివరాత్రి జాతర మహోత్సవాలకు వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానం ముస్తాబైంది. గురువారం నుంచి 9వ తేదీ శనివారం వరకు మూడు రోజుల వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందుకోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. మహా జాతర కోసం రాజన్న ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం ఉత్సవ కమిటీని నియమించగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్ మహా శివరాత్రి వేడుకల ఏర్పాట్లు, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. జాతరకు దేవస్థానం, ఇతర శాఖల సంబంధించి రూ.3 కోట్ల వరకు నిధులతో సౌకర్యాలు కల్పించనున్నారు. దేవస్థానం అధికారులతో పాటు రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, సెస్, ఆర్‌అండ్‌బీ, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, అగ్నిమాపక విభాగం శాఖల అధికారులను ఏర్పాట్లలో భాగస్వామ్యం చేశారు.

● జాతరకు 2 లక్షల మంది భక్తులు

సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా జనవరి, ఫిబ్రవరిలో భక్తులు తొలి మొక్కును వేములవాడ రాజన్నకు సమర్పించుకొని వెళ్లారు. భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకోని వెళ్లడంతో మహాశివరాత్రి జాతర జాగరణకు వచ్చే భక్తుల సంఖ్య దాదాపు 2 లక్షల వరకు ఉంటుందని అంచనా వేశారు. రాజన్నను దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈసారి ఉచిత పాస్‌లను రద్దు చేశారు. ప్రతి ఒక్కరూ రూ.300 చెల్లించి వీఐపీ దర్శనాల క్యూలైన్ ద్వారా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. రాజన్న దర్శనానికి వచ్చే భక్తుల కోసం 4 లక్షల లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేయడంతోపాటు ప్రత్యేక ప్రసాద కౌంటర్లను ఏర్పాటు చేశారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా 27 చోట్ల చలివేంద్రాలు, 7 చోట్ల రాజన్న జల ప్రసాదం, లక్ష మజ్జిగ ప్యాకెట్లు, శుద్ధజల క్యాన్‌లు, 20 ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేశారు. ధర్మగుండంలో మురికినీటిని ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్‌నుంచి దేవస్థానానికి వెళ్లడానికి నాలుగు ఉచిత బస్సులను అందుబాటులో ఉంచారు.

● ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు

మహాశివరాత్రి వేడుకలకు వేములవాడకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక అధికారులను నియమించారు. నిరంతరం పర్యవేక్షించే విధంగా ఏర్పాట్లు చేశారు.



స్వాగత తోరణం



జాతర ఆవరణలో ఏర్పాటు చేసిన షామియానాలు



మహిళల కోసం ఏర్పాటు చేసిన గదులు

తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, క్యూలైన్ల క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, చలువ పందిళ్లు వేశారు. రాజరాజేశ్వరస్వామి దేవస్థానంతోపాటు అనుబంధ దేవాలయాకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. మరోవైపు జాతరకు వచ్చే భక్తుల కోసం హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, హనుమకొండ, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, నిజామాబాద్, జగిత్యాల, మహబూబ్‌నగర్, నర్సంపేట, కోరుట్ల, మెట్‌పల్లి, అర్మూర్, నిర్మల్, సిరిసిల్ల, మంచిర్యాల, ఆదిలాబాద్ తదితర ప్రాంతాల నుంచి మూడు రోజులపాటు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు వేశారు. జాతర కోసం 900 బస్సులు నడిపించనున్నారు. వైద్య ఆరోగ్య శాఖ వేములవాడలో వివిధ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. మూడు రోజులపాటు 24 గంటలపాటు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించనున్నారు. అంబులెన్స్‌లతోపాటు బైక్ అంబులెన్స్‌లను సిద్ధం చేశారు

● నేటి నుంచి నిరంతర దర్శనం

మహా శివరాత్రి సందర్భంగా భక్తులకు నిరంతర దర్శన సౌకర్యం కల్పించారు. గురువారం 7వ తేదీన రాత్రి 7 గంటలకు స్వామి వారికి తిరుమల తిరుపతి దేవస్థానం వారిచే పట్టు వస్త్రాల సమర్పణ, రాత్రి 9 గంటలకు నిశిపూజ అనంతరం లఘుదర్శనం, కోడె మొక్కులు కొనసాగిస్తారు. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శివార్చన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. 8వ తేదీ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం 12 గంటల నుంచి 3 వరకు పురజనులకు సర్వదర్శనం, ఉదయం 3.30 నుంచి 4 వరకు ఆలయ శుద్ధి, మంగళ వాయిద్యాలు, ఉదయం 4 గంటల నుంచి 6 వరకు ప్రాతఃకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రులు పటు వస్త్రాలను సమర్పించనున్నారు. సాయంత్రం 4 గంటలకు శివదీక్ష స్వాములకు ప్రత్యేక దర్శనాలు, సాయంత్ర 6.05 నిమిషాల నుంచి స్వామివారి కల్యాణమండపంలో మహాలింగార్చన, రాత్రి 11.35 నిమిషాలకు లింగోద్భవ కాలంలో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. 9వ తేదీ శనివారం సుప్రభాతం నుంచి అర్జిత సేవలు, మొక్కుబడులు ప్రారంభిస్తారు. మూడు రోజులపాటు సర్వదర్శనం, కోడె మొక్కులు మినహా మిగతా అన్ని రకాల అర్జిత సేవలు రద్దు చేస్తారు.



బందోబస్తు పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్పీ

మహో జాతరకు ఏర్పాట్లు

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రాజరాజేశ్వరస్వామి క్షేత్రం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తుంది. మహాశివరాత్రి జాతరకు చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం మహాశివరాత్రి జాతరకు అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పట్టణాన్ని, ఆలయ పరిసరాలను తీర్చిదిద్దాం. మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు వసతి సౌకర్యం, తాగునీరు, చలువ పందిళ్లు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అత్యవసర సేవలు అందుబాటులో ఉంచాం. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను ఉత్సవాలకు ఆహ్వానించాం. ఢిల్లీలో సమావేశం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన రద్దయ్యింది. దీంతో రాజన్నకు పట్టువస్త్రాలను బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టు వస్త్రాలను సమర్పించనున్నారు. నిత్యం 900 బస్సులు నడిచేలా చర్యలు తీసుకున్నాం. రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. రాజన్న ఆలయం ఆధ్వర్యంలో తిప్పాపూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాజన్న ఆలయం వరకు ఉచిత మినీ బస్సులను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశాం.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎస్పీ అఖిల్‌మహాజన్

మహా శివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, జాతర సమయంలో పార్కింగ్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాట్లపై గురువారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. మూడు రోజులపాటు భక్తులకు భద్రతా పరంగా ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. మహాశివరాత్రి సందర్భంగా 1400 మంది పోలీస్ సిబ్బందితో కట్టు దిట్టమైన భద్రతా వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. జాతర ప్రాంగణంతోపాటు అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాల అధీనంలో ఉండేలా చూడాలన్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన అధికారులు సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. భక్తుల రద్దీ పెరిగే నేపథ్యంలో 8 చోట్ల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాతరకు వచ్చే వాహనాలను పార్కింగ్ ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ట్రాఫిక్ నిర్వహణ ప్రథమ స్థానంలో ఉంటుందని, గత అనుభవాల దృష్ట్యా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎమావేశంలో ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ సిరిసిల్ల, డీఎస్పీలు నాగేంద్రచారి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

సిరిసిల్ల క్రైం, మార్చి 6: సిరిసిల్ల డీఎస్పీగా చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ట్రాఫిక్-6 సౌత్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన భీం శర్మ వరంగల్ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీగా బదిలీపై వెళ్తూ చంద్రశేఖర్‌రెడ్డికి చార్జి ఇచ్చారు. జిల్లా డీసీఆర్‌బీ వర్టికల్ డీఎస్పీగా మహ్మద్ సర్వర్‌పాషా బాధ్యతలు చేపట్టారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామసభలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: మండల కేంద్రంతోపాటు బొప్పాపూర్ తదితర గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు, అధికారులు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం గ్రామ సభలను నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులు, కూలీల వివరాలు, తదితర అంశాలను సభలో వివరించారు. చేసిన పనులను కూలీ డబ్బులు చెల్లించలేదని తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి, మార్చి 6: మండలంలో పలు అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. మండలంలో లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో కిచెన్ షెడ్, వాటర్ ప్లాంట్ వద్ద బోర్ డ్రిల్లింగ్, చీర్లవంచలో రెడ్డి సంఘం భవన నిర్మాణానికి, మున్నూరు కాపు సంఘం భవనం వద్ద బోరు మోటారు, దేశాయిపల్లి అంగన్‌వాడీ భవన ప్రహరీ నిర్మాణానికి, ఇందిరమ్మకాలనీలో బోర్ మోటర్, రామన్నపల్లిలో ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మందాటి తిరుపతి యాదవ్, మునిగల రాజు, చుక్క శేఖర్, పర్శరాములు, గడ్డం మధుకర్, గుగ్గిళ్ల భరత్, ఆత్మకురి నాగరాజ్, గాదం తిరుపతి, నక్క రవి, మందాటి దేవయ్య, పన్నరెడ్డి, రాజీరెడ్డి, అనిల్ యాదవ్, తిరుపతి పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి



బాధ్యతలు స్వీకరించిన ఉత్సవ కమిటీ సభ్యులు

వేములవాడ టౌన్, మార్చి 6: నూతనంగా కొలువుదీరిన ఉత్సవ కమిటీ సభ్యులు మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీని దేవదాయశాఖ కమిషనర్ మంగళవారం ప్రకటించడంతో బుధవారం నూతన ఉత్సవ కమిటీ సభ్యులు కొలువుదీరారు. ఈ సందర్భంగా రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అధికారులతో సమన్వయం చేసుకొని జాతర ప్రశాంత వాతవరణంలో జరిగేలా చూడాలని అన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన అనుముల చంద్రయ్య, వడ్డెపల్లి వెంకటరమణ, రాజిరెడ్డి, విజయలక్ష్మి, సాగరం వెంకటస్వామి, పాత సత్యలక్ష్మి, కూరగాయాల కొమురయ్య, సంద్రగిరి శ్రీనివాస్, కనికరపు రాకేష్, నాంపల్లి శ్రీనివాస్, పులి రాంబాబు, తూమ్ సంతోష్, వుకులాభరణం శ్రీనివాస్, పిల్లి కనుకయ్య, సంగ స్వామి, జగన్మోహన్‌రెడ్డి, చేపూరి గంగయ్య, చింతపంటి రామస్వామి, కాయితీ నాగరాజు, అంజయ్య, ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, ధర్నా మల్లేశంకు అభినందనలు తెలిపారు.

వంద రోజులు ఉపాధి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు వంద రోజుల ఉపాధి కల్పించాలని డీఆర్‌డీఏ శేషాంద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాలకు చెందిన ఈజీఎస్ సిబ్బందికి ఉపాధి పనులపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ శేషాంద్రి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఒక్కరికి 100 రోజుల ఉపాధి పనులు చూపాలన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో చేసిన పనులకు ఈ నెల 7న సామాజిక తనిఖీ సభను నిర్వహించనున్నామన్నారు. ఎంపీడీవో సత్తయ్య, ఏపీడీ నర్సింలు, డీఆర్‌పీ తిరుమల, ఏపీవో కొమురయ్య, శ్రీహరి, టీఏలు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి



నారీశక్తిలో పాల్గొన్న బీజేపీ నాయకులు

తంగళ్లపల్లి, మార్చి 6: మహిళలు ఆర్థిక పరిపుష్టి పొందడమే నారీ శక్తి వందన్ కార్యక్రమం లక్ష్యమని బీజేపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు బర్కం లక్ష్మి అన్నారు. బుధవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నారీశక్తి వందన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా పథకాలు రూపొందించేలా చేయడం పథకం ఉద్దేశమన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు ప్రభాకర్, నవీన్ యాదవ్, కిషన్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

మహాశివరాత్రి జాతరకు పటిష్ఠ భద్రత : ఎస్పీ

వేములవాడ టౌన్, మార్చి 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో మహాశివ రాత్రి జాతరకు 1500 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వేములవాడలో గురువారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బందికి పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో విధులు నిర్వహణపై బుధవారం దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తుల మన్ననలు పొందేలా విధులు నిర్వర్తించాలని, సమన్వయంతో పని చేయాలన్నారు. ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. సమావేశంలో ట్రెయినీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్వర్, సీఐలు, ఎస్సైలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

మహాశివరాత్రి జాతరకు ఆహ్వానం



మంత్రి శ్రీధర్‌బాబును ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ బండి సంజయ్‌కి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న హరిహరనాథ్

వేములవాడ టౌన్, మార్చి 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు రావాలని ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆహ్వానించారు. జగిత్యాల జిల్లాలో నిర్వహించిన సమావేశంలో ఆయనను కలిశారు. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆహ్వాన్ని అందించారు. ఆలయ ఏఈవో బ్రాహ్మన్నగారి శ్రీనివాస్ పర్యవేక్షకుడు గోలి శ్రీనివాస్ ఉన్నారు.

● మహాశివరాత్రి జాతరకు హాజరుకావాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను రాజన్న ఆలయ అధికారులు ఆహ్వాన పత్రికను అందజేశారు. స్వామివారి సేవలో పాల్గొనాల్సిందిగా కోరినట్లు ఆలయ పర్యవేక్షకుడు హరిహరనాథ్ పేర్కొన్నారు.

రైతు వేదికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం

వేములవాడ రూరల్, మార్చి 6: రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా హన్మాజిపేటలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో గీత, ఎంపీడీవో శ్రీనివాస్, చందుర్తి, జడ్పీటీసీ నాగం కుమార్, మండల పశు సంవర్ధక అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలీ సేవాసంఘం ఆధ్వర్యంలో నిరసన

కొడిమ్యాల, మార్చి 6 :మండల కేంద్రంలోని అంగడి బజారులో బుధవారం సిరిసిల్ల కాంగ్రెస్ నాయకుడు కెకె మహేందర్‌రెడ్డి పద్మశాలీలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మను కొడిమ్యాల పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం కొడిమ్యాల ఎస్సై సందీప్‌కు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంకం రాజేశం, సంఘం నాయకులు లక్ష్మన్, రాజుకుమార్, జనార్దన్, అశోక్, చిరంజీవి, యెస్వంత్, దేవెందర్, రాకేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నరేంద్ర మోదీ సారధ్యంలో మహిళా సాధికారత

గొల్లపల్లి, మార్చి 6: కేంద్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కృషి చేస్తోందని, ప్రధాని నరేంద్ర మోదీ సారధ్యంలో వికసిత భారత్ మహిళా సాధికారత వైపు దూసుకెళ్తోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమల్ల కృష్ణహరి పేర్కొన్నారు. బుధవారం గొల్లపల్లి ఆర్యవైశ్య సంఘం భవనంలో బీజేపీ ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం ఆధ్వర్యంలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పీఎం నరేంద్ర మోదీ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి వర్చువల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో నారీ శక్తివందన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కన్వీనర్ సత్యం తెలిపారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి కట్టుబడి ఉన్నదని, ఈ నేపథ్యంలో విజయం సాధిస్తుందని అన్నారు.

వాడిపోతున్న పండ్ల తోటలు!

నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మతోటలకు నీటిగండం.. అడుగంటిన భూగర్భ జలాలు

- పంట నష్టం రూ.180 కోట్ల దాకా
- సర్కారు చొరవ చూపాలని రైతుల వినతి

నల్లగొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లాలో పండ్లతోటల రైతులకు నీటిగండం వెంటాడుతోంది. భూగర్భజలాల నీటిమట్టాలు రోజురోజుకీ పడిపోతుండటంతో వాటి ఆధారంగా సాగు చేసిన బత్తాయి, నిమ్మతోటలకు తీవ్ర నీటికొరత ఏర్పడింది. కనగల్లు మండలం చర్లగౌరారం, గుర్రంపోడు మండలం పోచంపల్లి సహా జిల్లావ్యాప్తంగా సుమారు 60వేల ఎకరాల్లో బత్తాయి, మరో 12 వేల ఎకరాల్లో వేసిన నిమ్మతోటలు నీరందక వాడిపోతున్నాయి. తోటలను కాపాడుకోవాలనే ఆశతో రైతులు లెక్కకుమిక్కిలిగా బోరుబావులు తవ్వుతున్న పరిస్థితి జిల్లా వ్యాప్తంగా ఏర్పడింది. నాన్ ఆయకట్టు ప్రాంతాలైన నల్లగొండ, దేవరకొండ డివిజన్లతో పాటు, మిర్యాలగూడ డివిజన్‌లోని మెట్ట ప్రాంతాల్లో ఈ కరువు పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని మెట్ట ప్రాంతాల్లో దాదాపు 300 నుంచి 500 అడుగుల లోతువరకు బోర్లు తవ్వినా, నీరు కనిపించకపోవడంతో రైతాంగం నైరాశ్యంలో మునిగింది. పండ్ల తోటలను సంరక్షించుకునేందుకు రైతులు ఒక్కొక్కరు 10, 20 వరకు బోర్లు వేస్తూ ఆర్థికంగా మరింత దెబ్బతింటున్న పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లావ్యాప్తంగా బత్తాయి, నిమ్మ రైతులు సుమారు రూ.180 నుంచి రూ. 200 కోట్ల వరకు నష్టపోవాల్సి వస్తుందని చెబుతున్నారు. చెట్లు కూడా ఎండిపోతే మరింత నష్టపోవాల్సి ఉంటుందని, 10, 15 ఏళ్ల పాటు చేసిన శ్రమంతా వృథా అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా వీలైనన్ని చెరువులను నీటితో నింపితే భూగర్భజలాలు అందుబాటులోకి వస్తాయని, తద్వారా పంట నష్టపోయినా.. తోటలైనా దక్కుతాయని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. సాగర్‌లో నిల్వలు లేనందున ఎగువన ఉన్న ఆల్మట్టి నుంచి నీటిని విడుదల చేయిస్తే ఆదుకున్నట్లవుతుందని, ఈ మేరకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని రైతులు కోరుతున్నారు.



నల్లగొండ జిల్లా చిన్నఅడిశర్లపల్లిలో బోరుబావి నీళ్లు తగ్గడంతో వచ్చే కొద్దినీటిని పైపుల ద్వారా బత్తాయి చెట్లకు పోస్తున్న రైతు కూరలింగయ్య

పశువుల మేతగా వరి పొలం

కూసుమంచి: యాసంగిలో వరి సాగు చేయొద్దని అధికారులు సూచించినా చాలామంది రైతులు పాలేరు పాతకాల్వ ఆయకట్టులో వరిసాగు చేశారు. అయితే పంట చివరి దశకు వచ్చిన ప్రస్తుత సమయంలో నీరు అందకపోవడంతో వరిపొలాలు ఎండిపోతున్నాయి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జక్కేపల్లి, పెరికశింగారంలో వరిపొలాలకు సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. పాలేరు నుంచి నీరు విడుదల చేయాలని రైతులు మొన్నటిదాకా ఆందోళనలు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో పాతకాల్వ పరిధిలో ఎండిపోతున్న వరి పొలాల్లో రైతులు తమ పశువులను మేపుతున్నారు.

చెరువులు నింపే కార్యాచరణ చేపట్టాలి



నాకు ఆరెకరాల బత్తాయి తోట ఉంది. భూగర్భజలాలు అడుగంటడంతో గతంలో ఉన్న బోరుబావులు నీరు పోయడం లేదు. నీళ్లందక తోట వాడిపోతోంది. ఇటీవల మూడు బోర్లు వేయించాను. చివరి బోరు 500 ఫీట్లవరకు వేసినా చుక్కనీరు రాలేదు. తోట ఎండితే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం తక్షణమే ఏఎమ్మార్పీ ద్వారా చెరువులు నింపేందుకు చర్యలు తీసుకోవాలి.

- పోలేని యాదయ్య, బత్తాయి రైతు, పోచంపల్లి, నల్లగొండ

నీళ్లు లేక నిమ్మతోట ఎండుతోంది



నాకు రెండు ఎకరాల నిమ్మతోట ఉంది. మరో నాలుగెకరాల్లో వరి కూడా వేశాం. గతంలో నాలుగు బోర్లుంటే ఎండిపోయాయి. ఇటీవల మళ్లీ నాలుగు బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. నిమ్మతోట ఎండిపోతే ఎకరాకు కనీసం లక్షవరకు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకొని మమ్మల్ని ఆదుకోవాలి.

- సత్తిరెడ్డి, నిమ్మరైతు, చర్లగౌరారం, నల్లగొండ జిల్లా

నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు


నేడు ప్రధాని శంకుస్థాపన

హైదరాబాద్/వికారాబాద్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రూ.137.76 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్రంలో చేపట్టనున్న నాలుగు పర్యాటక ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ గురువారం మధ్యాహ్నం శంకుస్థాపన చేయనున్నారు. ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం, భువనగిరి జిల్లాలోని భువనగిరి కోట, వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండలు, హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద చేపట్టే వివిధ అభివృద్ధి పనులను మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారు. స్వదేశీ దర్శన్, ప్రసాద్ పథకాల కింద దేశ వ్యాప్తంగా 52 పర్యాటక కేంద్రాలను ఎంపిక చేసిన కేంద్రం దాదాపు రూ.1325.76 కోట్ల వ్యయంతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టనుంది. ఇందులో భాగంగా ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయం అభివృద్ధికి, వసతుల కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.38.90 కోట్లు కేటాయించింది. అలాగే, భువనగిరి కోట ప్రాంతంలో విశ్రాంతి భవనాలు, పార్కులు, హరితవనాల అభివృద్ధికి, కోటపైకి చేరుకునేందుకు రోప్‌వే నిర్మాణానికి తొలి దశలో రూ.56.81 కోట్లు కేటాయించింది. హైదరాబాద్‌లోని బల్కంపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు ప్రసాద్ పథకం కింద రూ.4.05 కోట్లు కేటాయించారు. తెలంగాణ ఊటీగా ఖ్యాతి పొందిన అనంతగిరి కొండలు, అక్కడి అటవీ ప్రాంతాల్లో వసతుల కల్పనకు రూ.38 కోట్లు కేటాయించారు. ఆయా పనులు గురువారం ప్రారంభం కానున్నాయి. అనంతగిరి కొండలను ఎకో టూరిజం హబ్‌గా తీర్చిదిద్దనున్నారు. ఇందులో భాగంగా మొత్తం రూ.98 కోట్లతో అభివృద్ధి పనులను నాలుగు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు.

తాగునీటికి కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ తాగునీటి అవసరాలకే తరలించాలని మంత్రి పొన్నం తాజాగా అధికారులను ఆదేశించినా.. ఆ నీళ్లలో గరిష్ఠంగా ఏడు టీఎంసీల దాకానే వచ్చే అవకాశం ఉండటంతో పట్నంలో ఈ వేసవిలో తాగునీటికి కటకట తప్పదనే అంచనాలకు బలం చేకూరుతోంది. బుధవారం సచివాలయంలో జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు తదితర విభాగాల అధికారులతో బీసీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ పరిధిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కృష్ణా, గోదావరి బ్యారేజీల్లో ఉన్న నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీలు వినియోగించుకోవాలని సూచించారు. ఎల్లంపల్లి నీటిని గజ్వేల్, దుబ్బాక, సిద్దిపేటకు ఇవ్వకుండా హైదరాబాద్‌కు తరలిస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదని చెప్పారు. నీటి సరఫరా, రంజాన్‌లో ఏర్పాట్లు, వర్షాకాలంలో ముంపు ముప్పు నివారణ చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. 2017 అనంతరం ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా, నగరంలో తాగునీటికి ఇబ్బందులు లేవని మంత్రికి అధికారులు వివరించారు. వేసవితో పాటు రంజాన్ మాసంలో అవసరాల కోసం నీటి ట్యాంకర్లు 24 గంటలు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని, ఇందుకు ఆర్థిక ఇబ్బందులుంటే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పొన్నం చెప్పారు. విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోపు తాగునీరు, ఇతరత్రా వసతులకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ముంపు ముప్పు, ప్రాణ నష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మ్యాన్‌హోల్‌లు తెరిచి ఉంటే ప్రమాదకరం అని, అలాంటి చోట్ల సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సచివాలయం ముందు భారీగా వరద నీరు నిలుస్తోందని అధికారులు చెప్పడంతో ఆర్ అండ్ బీ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటామని పేర్కొన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా పోలీసులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల కోడ్ రాక ముందే ప్రారంభించే పనులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఫైల్)

ఎల్లంపల్లి నీరొచ్చినా దాహ'మే'!

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు అడుగంటుతోంది. పదేళ్లుగా ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది నీటి నిల్వలు భారీగా పడిపోయాయి. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడంతో కాళేశ్వరం నుంచి నీటి లభ్యత కూడా లేకుండాపోయింది. ప్రాజెక్టుకు తక్షణ నీటి సరఫరాకు అనుగుణంగా ఉండే కడెం ప్రాజెక్టులో కూడా నీటి నిల్వలు అడుగంటాయి. మార్చి 2వ తేదీ లెక్కల ప్రకారం 10.48 టీఎంసీల నీరే ఉంది. ఇక 7.66 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన కడెంలో ప్రస్తుతం 3.88టీఎంసీల నీరే ఉంది. ఇందులో డెడ్ స్టోరేజీ కింద 2.8 టీఎంసీలను మినహాయిస్తే ప్రాజెక్టు నుంచి ఒక టీఎంసీ మాత్రమే ఎల్లంపల్లికి తీసుకునే అవకాశం ఉంది. పైగా ఎల్లంపల్లి ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల కన్నా ఎక్కువ ఉంటేనే హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసేలా పంప్‌హౌస్‌ను ఏర్పాటు చేశారు. అంటే ఎల్లంపల్లికి కడెం నుంచి ఓ టీఎంసీ నీరు విడుదల చేసినా గరిష్ఠంగా ఏడు టీఎంసీలనే హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉంటుంది. ఈ నీళ్ల మార్చి, ఏప్రిల్ మాసాల్లో హైదరాబాద్‌కు తాగునీటి అవసరాలు తీరుతాయని.. మే, జూన్ నెలల్లో మాత్రం తాగునీటికి కటకట తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నాగార్జున సాగర్‌లో కూడా 515 లెవల్ వరకు నీళ్లు ఉన్నాయి. ఈ నీళ్లు మరో 5 ఫీట్ల మేర పడిపోతే హైదరాబాద్‌కు నీటి సరఫరా తగ్గొచ్చని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి

శ్రీరాంసాగరే దిక్కు

ఎండాకాలంలో హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం శ్రీరాంసాగరే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. శ్రీరాంసాగర్‌లో 40టీఎంల నీటి నిల్వలున్నాయి. ప్రధానంగా ఇక్కడి నీటిని సాగు అవసరాలకే వాడుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి నీటిని విడుదల చేస్తే తాగునీటి గండం నుంచి గట్టెక్కొచ్చు. అయితే ఈ విషయంలో నీటిపారుదల శాఖ అధికారులు స్పందించకపోవడం హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. సీఈలు, ఎస్ఈల స్థాయిల్లో చర్చకు పెట్టినా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో చలనం లేకపోవడం కలవరపెడుతోంది.

కాలుష్య నియంత్రణ బోర్డులో

అవినీతి అధికారులు

- మండిపడిన హైకోర్టు
- సుమోటోగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచన

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (టీపీసీబీ)లో అవినీతి అధికారులు ఉన్నారంటూ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పీసీబీని సంపూర్ణ ప్రక్షాళన చేసే దిశగా ఇలాంటి అధికారులపై సుమోటోగా చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. రంగారెడ్డి జిల్లా గగన్‌పహాడ్‌లో ఉన్న ఫ్రోస్టర్స్ అనే కంపెనీకి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ జారీచేసిన కంపెనీ మూసివేత నోటీసును హైకోర్టు కొట్టేసింది. వాటర్ (ప్రివెన్షన్ అండ్ కంట్రోల్ ఆఫ్ పొల్యూషన్) యాక్ట్ - 1988 ప్రకారం ఎందుకు చర్యలు తీసుకోరాదో వివరించాలని ఆ పీసీబీ అధికారి పిటిషనర్ కంపెనీకి షోకాజ్ నోటీసులు జారీచేశారు. చట్టంలోని నిబంధన ప్రకారం ప్లాస్టిక్ వాషింగ్ యూనిట్‌కు అనుమతి అవసరం లేదంటూ ఆ కంపెనీ సమాధానం ఇచ్చింది. కంపెనీ ఇచ్చిన వివరణను పట్టించుకోకుండా, తమ నోటీసులకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ అధికారి క్లోజర్ ఆదేశాలు జారీచేశారు. మూసివేత ఆదేశాలను సవాల్ చేస్తూ కంపెనీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ' రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాల్లో ఇదో బాధాకరమైన విషయం. పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని అవినీతి అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. పీసీబీ వ్యవస్థను పారదర్శకంగా మార్చాలి. గత ఏడునెలలుగా మేం పీసీబీ పనితీరును గమనిస్తున్నాం. కొంత మంది అధికారులు షోకాజ్ నోటీసులు ఇస్తారు.. మరి కొంత మంది అధికారులు వచ్చి ఎలాంటి సమాధానం రాలేదంటూ తుది ఆదేశాలు ఇస్తారు. సామర్థ్యం లేని అధికారులను మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాలి ' అని వ్యాఖ్యానించింది. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా జారీచేసిన మూసివేత ఉత్తర్వులు చెల్లవని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఈ పనిని వేరే అధికారికి అప్పగించి.. 15 రోజుల్లో తాజా ఆదేశాలు జారీచేయాలని స్పష్టం చేసింది. 15 రోజుల్లో తాజా ఆదేశాలు ఇవ్వకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని స్పష్టం చేసింది.

ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ రాజకీయం!

- కేటీఆర్‌కు కోదండరెడ్డి ప్రశ్న

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌పై బీఆర్‌ఎస్ పార్టీ రాజకీయం చేస్తోందని... ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అక్రమ లే అవుట్లు వేస్తుంటే నిద్రపోయారా అని కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి ప్రశ్నించారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ఇచ్చిన రెండు జీవోలూ గత ప్రభుత్వం ఇచ్చినవేనని, కేటీఆర్ మంత్రిగా ఉన్నప్పుడు ఇచ్చిన ఆ జీవోల్లోనే ధరలూ నిర్ణయించారన్నారు. గాంధీ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు అమాయక ప్రజల నుంచి డబ్బులు లాక్కునే ప్రయత్నం చేసిన కేటీఆర్.. ఇప్పుడేమో ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలంటూ చెబుతున్నారన్నారు. హౌసింగ్ బోర్డు ద్వారా పేదలకు ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కోకాపేటలో పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి ఇస్తే.. కేసీఆర్ వాటిని లాక్కుని బిల్డర్లకు ఇచ్చారన్నారు. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు కంపెనీకి అప్పగించేశారన్నారు. జీవో 111 పరిధిలోని భూములనూ ఆక్రమించారన్నారు. వీటన్నిటిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

బీఆర్‌ఎస్ బలహీనపడింది

- పొత్తులతో అది స్పష్టం: నిరంజన్

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీతో పొత్తు పెట్టుకోవడం ద్వారా బీఆర్‌ఎస్ పార్టీ ఎంత బలహీనపడిందో స్పష్టమైందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు ఆ పార్టీని వీడి వెళుతుండడంతో ఉనికిని కాపాడుకునేందుకు కేసీఆర్ నానా తంటాలు పడుతున్నారన్నారు. నిబద్ధత గల అధికారిగా పేరున్న ప్రవీణ్‌కుమార్‌కూ ఇది ఒక చెరగని మచ్చ అన్నారు. దళితుడిని తెలంగాణకు తొలి సీఎంగా చేస్తానని చెప్పి మాట తప్పినందుకు కేసీఆర్ పంచన చేరారా... అంటూ ప్రవీణ్‌కుమార్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఏక్‌నాథ్ షిండేగా పేర్కొంటున్న కేటీఆర్.. హింసించే రాజు 23వ పులకేశి అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కైలాష్ నేత ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను కేసీఆర్ హోల్‌సేల్‌గా బీజేపీకి అమ్మకానికి పెట్టారన్నారు. ప్రవీణ్‌కుమార్‌ని పెంచి పోషించింది బీఆర్‌ఎస్ పార్టీనేనని, అది ఇప్పుడు బట్టబయలైందని అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈమేరకు మాట్లాడారు.

గాంధీభవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీభవన్‌లో బుధవారం మహిళాకాంగ్రెస్ ఆధ్వర్యంలో వేడుక జరిగింది. మహిళా కాంగ్రెస్ నేతలు భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖ, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటర్ల వివరాలు ఇవ్వండి

- ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంటరీ నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్‌ల వారీగా ఇంటినంబర్లతో కూడిన మ్యాప్ (నజ్రీ నక్ష)లను మాజీ ఎంపీ, ఆ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అందజేయాలని ఎన్నికల అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ గతేడాది జారీచేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌వోపీ) ప్రకారం నజ్రీ నక్ష అందజేయాల్సి ఉండగా అందుకు ఎన్నికల అధికారులు నిరాకరిస్తున్నారని పేర్కొంటూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో 2.40 లక్షల మంది నకిలీ ఓటర్లు ఉన్నారని.. హైదరాబాద్‌లో 1.65 లక్షల మంది వరకు ఉన్నారని ఆరోపించారు. ఎన్నికల అధికారులు ఇంటి నెంబర్లతో కూడిన నజ్రీ నక్షలను బయటపెట్టకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయి వాదనలు వినిపిస్తూ.. ఫొటోలతో కూడిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా, ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలోని ఏరియాను ప్రతిబింబించే నజ్రీ నక్షను ఆయా రాజకీయ పార్టీలకు ఎన్నికల అధికారులు అందజేస్తారని పేర్కొన్నారు. తగిన మొత్తంలో రుసుము చెల్లిస్తే పిటిషనర్‌కు నక్ష అందజేయడానికి అభ్యంతరం లేదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఖర్చులు స్వీకరించి పిటిషనర్ కోరిన విధంగా నజ్రీ నక్ష అందజేయాలని ఆదేశించింది.

సీడ్ కార్పొరేషన్‌లో సిత్రాలెన్నో!

(మొదటి పేజీ తరువాయి)

ఆర్భాటంగా ప్రకటించగా.. గడిచిన పదేళ్లలో విత్తనోత్పత్తి కాస్తా ఏటా నేలచూపులు చూస్తూ.. అధఃపాతాళానికి పడిపోయింది. విత్తనాల నాణ్యతను ధ్రువీకరించే 'సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ'లోనూ అన్నీ అవకతవకలే.! ఇక్కడ సిబ్బంది బయోమెట్రిక్ ఉండదు. ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అసలు విధుల్లోకే రారు. సంతకాలు చేయరు. తొమ్మిదేళ్లుగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్‌గా, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ హెచ్‌వోడీగా, సీడ్ కార్పొరేషన్ ఎండీగా కె.కేశవులు పనిచేస్తున్నారు. ఈ తొమ్మిదేళ్లలో రికార్డు స్థాయిలో 28 విదేశీ పర్యటనలు చేశారు. ఏ ముఖ్యమంత్రి గానీ, మంత్రులు గానీ ఇన్ని విదేశీ పర్యటనలు చేయకపోవడం విశేషం. పైగా.. 2022 అక్టోబరులో నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో కె.కేశవులు స్వస్థలమేది? అంటూ ఓ ప్రశ్న రావడం గమనార్హం!

గ్రో ఔట్ టెస్ట్ నిధులెక్కడ?

విత్తనాభివృద్ధి కోసం గ్రో ఔట్ టెస్ట్(జీవోటీ) ఫామ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.50 లక్షలను మ్యాచింగ్ గ్రాంట్ కింద అందజేశాయి. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వర్సిటీ ప్రాంగణంలో ఈ ఫామ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పుడు అక్కడ పాడుబడ్డ ఓ గేటు, చెట్లు పొదలు, ముళ్ల కంపలు తప్ప. అక్కడ ఫామ్ లేదు. అయితే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన రూ.కోటి నిధులు ఎక్కడ? అనేది ఇప్పుడు ప్రశ్నగా మారింది. ఒక్క విత్తన గింజను ఉత్పత్తిచేయకున్నా.. యూసీలు మాత్రం సమర్పించారు. తెలంగాణను 'సీడ్ బౌల్ ఆఫ్ ఇండియా'గా చేస్తామంటూ గత ప్రభుత్వం చేసిన ప్రకటన ఆర్భాటాలకే పరిమితమైంది. లక్షల నిధులు కేటాయించినా.. విత్తనోత్పత్తి పెరగకపోగా.. సీడ్ కార్పొరేషన్‌లో పదేళ్లుగా నేలచూపులు చూస్తోంది. ఎగుమతులు క్షీణించాయి. 2014-15లో సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన విత్తనోత్పత్తి 3.18 లక్షల క్వింటాళ్లు కాగా.. 2021-21లో 1.56 లక్షల క్వింటాళ్లు, 2022-23లో 1.78 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. విత్తన పంపిణీ 2014-15లో 3.36 లక్షల క్వింటాళ్లుగా ఉండగా.. 2022-23లో అది 3.05 లక్షల క్వింటాళ్లకు పడిపోయింది. సీడ్ సర్టిఫికేషన్ ఏజెన్సీలో రిజిస్ట్రేషన్లు కూడా గణనీయంగా పడిపోయాయి. 2015-16తో పోలిస్తే.. 2022-23కల్లా ఈ రిజిస్ట్రేషన్లు 1.65 లక్షల మేర తగ్గిపోయాయి.

ఇస్టా కాంగ్రెస్‌కు ఇష్టారాజ్యంగా నిధులు

హైదరాబాద్‌లో 2019 జూన్ నెలలో 32వ ఇస్టా కాంగ్రెస్ సదస్సును నిర్వహించారు. 75 దేశాల నుంచి 451 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరైనట్లు ఇస్టా కాంగ్రెస్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించిన టీఎస్-ఎస్‌వోసీఏ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.కేశవులు అప్పట్లో వెల్లడించారు. ఈ సదస్సు నిర్వహణకు అప్పట్లో 'రైతుబంధు' నిధులను మళ్లించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. సుమారు రూ.10 కోట్ల నిధులను ఇస్టా కాంగ్రెస్ సదస్సుకు ఖర్చు చేశారు. ఇందులో పెద్దమొత్తంలో నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలున్నాయి. మూడు రోజులకు నోవాటెల్ హోటల్ హాలు, భోజనాలకే రూ.70 లక్షల ఖర్చు రాశారు. డెలిగేట్స్ గదులకు రూ.25 లక్షలు, స్టాల్స్ ఏర్పాటుకు రూ.43.12 లక్షలు, కార్నివాల్ ఏర్పాట్లకు రూ.20.37 లక్షలు, తాజ్ హోటల్స్‌లో ఫుడ్ అండ్ బేవరేజెస్‌కు రూ.26.34 లక్షలు, సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.25.65 లక్షలు, ప్రచారానికి రూ.12 లక్షలు, హైటెక్స్‌లో స్టేజీ ఇతరత్రా ఏర్పాట్లకు రూ.20 లక్షలు, ఇస్టా వీడియో ఫిల్మ్‌లకు రూ.18 లక్షలు, ఎగ్జిబిటర్లు, అధికారుల ఫీజులకు రూ.52.75 లక్షలు, రైతుల సమావేశానికి రూ.56 లక్షలు, చిల్లర ఖర్చులకు రూ.15 లక్షలు వెచ్చించారు. చివరకు నోడల్ ఆఫీసర్ కేశవులు ఐ-ఫోన్ కోసం రూ.65 వేలను ఈ నిధుల్లోంచే ఖర్చుచేశారు. హైదరాబాద్‌లోని పలు స్టార్‌హోటళ్ల పేరుతో విచ్చలవిడిగా బిల్లులను సమర్పించారు. దీనిపై అప్పట్లో విమర్శలు వచ్చినా.. నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

జీతం ఇక్కడ.. చేసేది ఆర్డర్లీ

సీడ్ సర్టిఫికేషన్‌లో ఉద్యోగంలో చేరిన ఇద్దరు ఔట్ సోర్సింగ్ సిబ్బంది.. విధులకు హాజరవ్వడం లేదు. బయోమెట్రిక్ వేయటం లేదు. ఒకరేమో హైదరాబాద్ లంగర్‌హౌస్‌లో నివాసముంటున్న ఏపీ మాజీ సీఎస్ ఇంట్లో పనిచేస్తున్నారు. మరొకరు ఆ మాజీ ఐఏఎస్ ఇంటిపక్కనే ఉండే సీడ్ కార్పొరేషన్ ఎండీ ఇంట్లో ఊడిగం చేస్తున్నట్లు సమాచారం. ఈ ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏడాదికోసారి తెల్లకాతాలపై సంతకాలు చేసి పంపుతున్నట్లు.. దాన్నే రెన్యూవల్ ఆఫ్ సర్వీసెస్‌గా అధికారులు రికార్డుల్లో పెడుతున్నట్లు తెలుస్తోంది.

ప్రైవేటు ఏజెన్సీలతోనే ఆడిటింగ్

తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ సంస్థకు సంబంధించిన ఆడిట్‌ను ఏటా ప్రైవేటు ఏజెన్సీలతోనే చేయించారు. ఒక 2021-22లో మాత్రమే ఏజీ ఆడిట్ జరిగింది. ఆర్‌కేవీవై పథకంలో వరంగల్‌లో ఆఫీస్ బిల్డింగ్ పూర్తిగా నిర్మించకుండానే రూ.95 లక్షలకు యూసీలు సమర్పించినట్లు తెలుస్తోంది. మినీ బస్ కొనుగోలు, సబ్-మిషన్ ఆఫ్ సీడ్స్ అండ్ ప్లాంటింగ్ మెటీరియల్ నిధుల మళ్లింపు, వాహనాల నిర్వహణ, వ్యవసాయశాఖ కార్యదర్శి కార్యాలయంలో పనిచేసే టెక్నికల్ సిబ్బందికి వేతన చెల్లింపులు, ఈపీఎఫ్-ఈఎస్ఐ కాంట్రిబ్యూషన్, కాకాని కన్సల్టెన్సీకి చేసిన చెల్లింపులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సీడ్ టెస్టింగ్ ల్యాబ్ పేరుతో ఆర్‌కేవీవై నిధుల మళ్లింపులో జరిగిన అవకతవకలు ఏజీ ఆడిట్‌లో వెలుగుచూశాయి. మిగిలిన సంవత్సరాల్లో చిట్టిబాటు అండ్ కంపెనీ, సుబ్రమణ్యం అండ్ కంపెనీ అనే ఏజెన్సీలతో ఆడిట్ చేయించారు. అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే ప్రైవేటు ఏజెన్సీలతో ఆడిట్ చేయించినట్లు ఆరోపణలున్నాయి.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: మహిళలు కుట్లు, అల్లికలపై శిక్షణ పొంది ఆర్థిక అభివృద్ధి సాధించాలని ఎంపీపీ రేణుక అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో మహిళలకు నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కుట్లు అల్లికలతో ఉపాధి సాధించాలని సూచించారు. స్పందన సొసైటీ సీఈవో శోభారాణి, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు

వేములవాడ టౌన్, మార్చి 6: వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో ఎన్నికల అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజారి గౌతమి వ్యవహరించనున్నారు. గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ పరిధిలో కౌన్సిలర్లుగా ఎన్నికైన సభ్యులు మాత్రమే కార్యాలయంలోకి అనుమతించనున్నట్లు వారికి ముందుగానే సమాచారం అందినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరుకానున్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం

ఇల్లంతకుంట, మార్చి 6: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టిక ఆహారం అందిస్తోందని ఎంపీడీవో శ్రీనివాసమూర్తి అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో బుధవారం ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ తీగల పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు మంగ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టనున్న నేపథ్యంతో గ్రామాల్లో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయనున్నామన్నారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించి అనర్హులకు చోటు లేకుండా అధికారులు, కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తారన్నారు. దశల వారీగా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయన్నారు.

10న రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం

సిరిసిల్ల రూరల్, మార్చి 6: రంగినేని ఎల్లమ్మ సాహిత్యపురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీన ఆదివారం రంగినేని చారిటబుల్ ట్రస్టులో నిర్వహించనున్నట్లు రంగినేని సుజాత మోహన్‌రావు ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, కన్వీనర్ మద్దికుంట లక్ష్మణ్ తెలిపారు. 'రెప్పవాలని రాత్రి' కవితను రచించిన వంశీకృష్ణ ఎంపికయ్యారు. రగుడు శివారులోని రంగినేని ట్రస్టులో ఆదివారం ఉదయం నిర్వహించే కార్యక్రమానికి ఈనాడు సంపాదకుడు డీఎన్ ప్రసాద్, కవి అందెశ్రీ, జూకంటి జగన్నాథం, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నామని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్‌లోని ముదిరాజ్ కుల సంఘం ఆవరణలో మండల పరిషత్తు నిధులతో ఏర్పాటు చేసిన బోరు మోటారును స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగు నీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీటీసీ బాబు, మాజీ సర్పంచ్ రవీందర్, నాయకులు దేవయ్య, రమేశ్, నర్సింహులు, సుభాష్, సాయిలు, సత్తయ్య, దేవేందర్, శ్రీనివాస్, రాజయ్య, రవీందర్, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల

సిరిసిల్ల క్రైం, మార్చి 6: జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను బార్ కౌన్సిల్ బుధవారం విడుదల చేసింది. తెలంగాణ హైకోర్టు పరిధిలో ఉన్న అన్ని కోర్టుల బార్ అసోసియేషన్‌లు ఇదే షెడ్యూల్‌ను అమలు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ నర్సింహరెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈ షెడ్యూల్‌లో భాగంగా ఆయా అసోసియేషన్‌ల తుది ఓటర్ల జాబితాను ఈ నెల 15న ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ నెల 18న ఉదయం 10 గంటలకు నామినేషన్‌ల స్వీకరణ ప్రారంభించి 20న సాయంత్రం 5గంటలకు ముగించాలని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ నెల 21న సాయంత్రం 5గంటల వరకు నామినేషన్‌ల పరిశీలన, ఈ నెల 22న సాయంత్రం 4గంటల లోపు నామినేషన్‌ల విత్ డ్రా అనంతరం అభ్యర్థుల తుదిజాబితా విడుదల చేయాలని పేర్కొన్నారు. ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించి ఫలితాలు ప్రకటించాలని, ఏప్రిల్ 1న నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టాలని సూచించారు.

పాఠశాలలో వెజిటెబుల్స్ డే

వీర్నపల్లి, మార్చి 6: మండలంలోని రంగంపేట ఎంపీయూపీఎస్ పాఠశాలలో వెజిటెబుల్స్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల కూరగాయలు తీసుకొచ్చి ప్రదర్శించారు. కొంతమంది విద్యార్థులు కూరగాయల వేషధారణలో ఆకట్టుకున్నారు.

బహ్రెయిన్‌లో అక్కపల్లివాసి హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, మార్చి 6: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన పల్లి అంజయ్య (43) బహ్రెయిన్‌లో గుండెపోటుతో మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు బుధవారం తెలిపారు. గ్రామంలోని పల్లి అంజయ్య ఉపాధి నిమిత్తం ఆరేళ్ల కిందట బహ్రెయిన్ వలస వెళ్లాడు. అక్కడ ఓ కంపెనీలో పనులు చేస్తున్నాడు. రోజులాగే పనులకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణంలో గదిలో చాతిలో నొప్పి అంటూ అంజయ్య కుప్పకూలాడు. మిత్రులు ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందాడని నిర్ధారించారు. ప్రభుత్వం, భారత రాయబార కార్యాలయం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చొరవచూపాలని స్థానికులు కోరుతున్నారు.

కోనరావుపేట అభివృద్ధికి నిధులు మంజూరు

కోనరావుపేట, మార్చి 6: మండల అభివృద్ధికి కోటి యాభై లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య, చందనగిరి గోపాల్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన రెండు నెలలకే మండలానికి కోటి యాభై లక్షలు మంజూరు చేయించారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గొట్టే రుక్మిణి, నిత్యానందం, లింబయ్య, సదానందం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

వేములవాడ టౌన్, మార్చి 6: వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆర్డీవో సోమ రాజేశ్వర్ సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. పట్టణంలో ఆర్డీవో కార్యలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయా పార్టీల రాజకీయ ప్రతినిధులు హాజరయ్యారు. ఎన్నికల సందర్భంగా ఈవీఎం వీవీప్యాట్ అవగాహన ప్రదర్శన కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశంలో నరేందర్, నిత్యానందరావు, రాము, జింక ఎల్లయ్య, సురేష్ తదితరులు ఉన్నారు.

స్వగ్రామం చేరిన వలస జీవి మృతదేహం

కోనరావుపేట, మార్చి 6: మలేషియాలో మృతి చెందిన వలస జీవి మృదేహం బుధవారం స్వగ్రామం చేరింది. కోనరావుపేట మండలం కొలనూరు గ్రామానికి చెందిన సుధమల్ల శ్రీకాంత్ (33) అనే వలసజీవి కొన్ని రోజులుగా మలేషియా వెళ్తున్నాడు. ఈ క్రమంలో నెల రోజుల క్రితం పక్షవాతానికి గురయ్యాడు. అక్కడ వైద్యం అందించినప్పటికీ ఆరోగ్యం క్షీణించి ఫిబ్రవరి 22 తేదీన మృతి చెందాడు. స్నేహితులు మృతదేహాన్ని బుధవారం స్వగ్రామం చేర్చారు.

ఎల్ఆర్ఎస్ ఉచితంగా అమలు చేయాలి

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



వేములవాడలో..

సిరిసిల్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సిరిసిల్ల నియోజకవర్గ కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఫీజు లేకుండా ఉచితంగా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజ్ చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీలో మాట ఇచ్చి తప్పిందన్నారు. ఈ సందర్భంగా నాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటే మర్చిపోయిన కష్టాలు మళ్లీ తిరిగి వచ్చాయన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎల్ఆర్ఎస్ కోసం రూపాయి కట్టనవసరం లేదని, ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి రాగానే ఫీజు వసూలు చేయడానికి పూనుకుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అండగా పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్నికల్లో ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే రూ.లక్ష చొప్పున వసూలు చేసి అమలు చేయాలని చూస్తున్నారని అన్నారు. ఉచితంగా ఎల్ఆర్ఎస్ అన్నా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భట్టికి దమ్ముంటే ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలన్నారు. లేదంటే ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ ఉచితమన్నా ఉత్తమ్ మాటలు ఉత్తవిగా మారాయన్నారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు వేస్తే ఎల్ఆర్ఎస్‌పై ద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, తంగళ్లపల్లి అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, గంభీరావుపేట అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ముస్తాబాద్ మండల అధ్యక్షుడు గోపాడి సురేందర్‌రావు, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, వీర్నపల్లి మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంపీపీలు పిల్లి రేణుక, పడిగెల మానస, జడ్పీటీసీలు చీటి లక్ష్మణ్‌రావు, సెస్ డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, సందుపట్ల అంజిరెడ్డి, గౌరినేని నారాయణరావు, బీఆర్ఎస్ నాయకులు యాదగిరిరావు, కృష్ణారెడ్డి, బండి దేవదాస్, బొల్లి రామ్మోహన్, రాజారాం, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పేరిట ప్రజలను దోచుకుంటోందని ఆరోపించిన కాంగ్రెస్ ఉచితంగా ఇస్తామని చెప్పి ఇప్పుడు ఎందుకు మాట తప్పుతోందని వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని కోరుతూ ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఎల్ఆర్ఎస్ ఫ్రీగా అమలు చేయాలని కోర్టును కూడా ఆశ్రయించారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఉచితంగా అమలు చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. జడ్పీటీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎంపీపీలు బండ మల్లేశం యాదవ్, చంద్రయ్య, లావణ్య, సెస్ డైరెక్టర్‌లు రేగులపాటి హరిచరణ్‌రావు, ఆకుల దేవరాజు, కౌన్సిలర్‌లు మారం కుమార్, సిరిగిరి చందు, నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, యాచమనేని శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

● వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ధర్నాలో మాట్లాడుతూ జై బీఆర్ఎస్ నినాదానికి బదులుగా జై కాంగ్రెస్ అన్నారు. దీంతో అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఒక్కసారిగా కంగుతిన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే చలో హైదరాబాద్



ధర్నా చేస్తున్న కార్మికులు, నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 6: సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంతోపాటు నేతన్నల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడతామని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం ఎదుట బుధవారం సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో మరమగ్గాల కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభం, ప్రభుత్వం బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వకపోవడం, పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోవడం వంటి పరిణామాలతో కొన్ని నెలల నుంచి సిరిసిల్లలో మరమగ్గాల పరిశ్రమలు బంద్ అయ్యాయని, వస్త్ర పరిశ్రమలపై ఆధారపడి పని చేస్తున్న వేలాది మంది మరమగ్గాల కార్మికులు అనుబంధ రంగాల కార్మికులు, ఆసాములు ఉపాధి ని కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని అధికారులు, ప్రజాప్రతి నిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే గతంలో మాదిరిగానే మళ్లీ ఆకలి చావులు, ఆత్మహత్యలు పునరావృతం అయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించాలని, తక్షణమే బతుకమ్మ చీరలతో పాటు ప్రభుత్వ ఆర్డర్‌లను కేటాయించాలని అన్నారు. టెక్స్‌టైల్ పార్క్‌లో కాటన్ ఆర్వీఎంకు సంబంధించిన కార్మికులకు కూలీ పెంచడంతో పాటు వర్కర్ టు ఓనర్ పథకాన్ని పూర్తి చేయాలని అన్నారు. జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు అన్నల్‌దాస్ గణేష్, కూచన శంకర్, అక్కల శ్రీనివాస్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేష్, బెజుగం సురేష్, గడ్డం రాజశేఖర్, మూషం శంకర్, ఆడెపు రవి, రవీందర్, రాజమౌళి, వెంకటేశం, రాజు,ప్రవీణ్, సత్యం మహేష్, సంపత్ పాల్గొన్నారు.

'ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోం'

ముస్తాబాద్, మార్చి 6:ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకోబోమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్తాబాద్ మండలానికి వచ్చిన మాజీ మంత్రి కేటీఆర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డిపైనా, సీఎం రేవంత్ రెడ్డిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. పదేళ్లలో ముస్తాబాద్ మండలానికి ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలు చేశారన్నారు. ముస్తాబాద్ మండలానికి మినీ స్టేడియం, 30 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కాలయాపన చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే గ్యారంటీలు అమలు చేస్తున్న కాంగ్రెస్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కలకొండ కిషన్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాలకార్ శ్రీనివాస్, తలారి నర్సింలు, శీల ప్రశాంత్, రంజాన్, నరేష్, తాళ్ల విజయ్ రెడ్డి, ఉచ్చిడి బాల్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల ఆర్డర్లు అందించాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్ననాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 6: సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు పద్మశాలీ కులస్థులకు ఉపాధిని కల్పించేందుకు బతుకమ్మ చీరల ఆర్డర్‌లను అందించాలని పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, టీఎస్‌పీటీడీసీ మాజీ చైర్మన్ గుడూరి ప్రవీణ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మశాలీ సంఘం భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సంక్షోభంలో ఉన్న వస్త్ర పరిశ్రమలను ఆదుకునేలా బతుకమ్మ చీరలను అందించడంతోపాటు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో పద్మశాలీ సంఘం నాయకులు బాలయ్య, మోర రవి, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, గుండ్లపల్లి శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు గుండ్లపల్లి పూర్ణచందర్, కౌన్సిలర్లు గెంట్యాల శ్రీనివాస్, దూస వినయ్, నాయకులు బొద్దుల భాస్కర్, అడ్డగట్ల మురళీ, మ్యానరవి, తమ్మరాజు, రిక్కుమల్ల సంపత్, బింగి రాంబాబు, మామిడాల రమణ, గోసిక శ్రీనివాస్, మేర్గు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఆర్టీసీ డిపోలో మహిళా దినోత్సవం వేడుకలు



కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో.

సిరిసిల్ల రూరల్, మార్చి 6 : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్, జిల్లా ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయశ్రీ, ప్రధానోపాధ్యాయిని నాగుల భాగ్యరేఖ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్ల ఆర్టీసీ బస్సు డిపో ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్‌లో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ సారయ్య ఎస్‌డీఐ రాంరెడ్డి, ఏఎంఎఫ్ఏకే ఖాన్, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, ఈడబ్ల్యూబీ మెంబర్స్ నర్సింలు, మల్లేష్, మహిళ కండక్టర్‌లు సునీత, సుజాత, కవిత పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో

జిల్లా మహిళా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్లలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కామిని వనిత ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పలువురు మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్‌లు మడుపు శ్రీదేవి, ఆడెపు చంద్రకళ, వెల్ముల స్వరూప పాల్గొన్నారు.

ఆసాములకు ఉపాధి కల్పించాలి



సిరిసిల్లలో రిలేనిరాహార దీక్ష చేస్తున్న ఆసాములు

సిరిసిల్ల రూరల్, మార్చి 6: ప్రభుత్వ ఆర్డర్‌లు అందించి ఉపాధి కల్పించాలని ఆసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని భద్రావతి సంఘం వద్ద ఆసాముల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్ష బుధవారానికి రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. దానిపై ఆధారపడి జీవిస్తున్న ఆసాములు, మరమగ్గాల కార్మికులతోపాటు అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తమ బాధలను గుర్తించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కేటీఆర్ అని, తమ మీదకక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దని అన్నారు. కార్యదర్శి చేరాల అశోక్, మండల రాజు, వెల్దండి రాజేశం, సత్యనారాయణరెడ్డి, వంగశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

200లోపు రీడింగ్ తిరిగినా కరెంటు బిల్లు

- జీరో బిల్లులు రాకపోవడంపై ఆందోళన

గంభీరావుపేట, మార్చి 6: గంభీరావుపేట మండలంలో గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో కరెంట్ బిల్లు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించింది. 200 లోపు మీటర్ రీడింగ్ ఉంటే గృహజ్యోతి పథకానికి అర్హులవుతారని ప్రభుత్వం ప్రకటించింది. మండల కేంద్రంలో లక్కిరెడ్డి రాజేందర్‌రెడ్డి అనే వినియోగదారుడికి 192 యూనిట్లు విద్యుత్ కాలింది. జీరో బిల్లు రావల్సింది పోయి 1011 రూపాయల బిల్లు వచ్చిందని వినియోగదారుడైన రాజేందర్‌రెడ్డి లబోదిబో మంటున్నాడు. ఈ విషయాన్ని సెస్ అధికారుల దృష్టికి తీసుకెళితే ఎంపీడీవో కార్యాలయంలో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారని వాపోయాడు.తాను విద్యుత్ బిల్లులు బకాయి లేనని, అలాంటప్పుడు జీరో బిల్లు రాక పోవడమేంటని ప్రశ్నించాడు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్



వంటకాలను పరిశీలిస్తున్న సభ్యులు

గంభీరావుపేట, మార్చి 6 : గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా శ్వేత, ఖలీల్, మమత వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, డబ్లూఈసీ కో ఆర్డినేటర్ వాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. కార్యకర్తలకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనర్సింహారావు

రుద్రంగి, మార్చి 6: బీఆర్ఎస్ అధికారంలో లేదని కార్యకర్తలు అధైర్య పడవద్దని, అండగా ఉంటామని వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహరావు అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణతో కలిసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఒకటి రెండు తప్ప మిగతావి అమలుకాలేదన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, వైస్ ఎంపీపీ పిసరి చిన్న భూమయ్య, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దెగవాత్ తిరుపతి, గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్, ప్యాక్స్ డైరెక్టర్ కెసిరెడ్డి నర్సరెడ్డి, బండారి నర్సయ్య, గణేష్, కర్నవత్తుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేరుస్తున్న కాంగ్రెస్



జీరో కరెంటు బిల్లు అందజేస్తున్న నాయకులు

ఇల్లంతకుంట, మార్చి 6: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌పార్టీ నెరవేరుస్తోందని నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్, వల్లంపట్ల, రేపాక గ్రామాలలో బుధవారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన మాట ప్రకారం నాలుగు గ్యారంటీలను అమలు చేసినట్లు చెప్పారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కరివెద స్వప్నకర్ణాకర్ రెడ్డి, నాయిని స్రవంతిరమేష్, కాథ సుమలత మల్లేశం, మాతిరెడ్డి నవీన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మోహన్, సంపత్, లచ్చయ్య, కేశయ్య, పర్శరాం, బాబు, కొమురయ్య, లక్ష్మణ్, లింగయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని పార్టీ నాయకులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి, వెంకటాపూర్ తదితర గ్రామాల్లో గృహజ్యోతి పథకంలో భాగంగా జీరో కరెంటు బిల్లును స్థానిక నాయకులు, అధికారులు బుధవారం ప్రారంభించారు. నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సాహెబ్, రాజిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, సుధాకర్, దేవరాజు, సమద్, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, సత్తిరెడ్డి, దేవరెడ్డి, రవి, ప్రశాంత్, రమేశ్, భగవంతరెడ్డి, శ్రీను, సెస్ హెల్పర్ శ్రీనివాస్, అసిస్టెంట్ హెల్పర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోగానే పిచ్చిపట్టినట్టు మాట్లాడుతున్న కేటీఆర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 6: రాష్ట్రంలో అధికారం పోగానే మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ పిచ్చి పట్టినట్లు మాట్లాడుతున్నారని, అసెంబ్లీలో బతుకమ్మ చీరల బకాయిలపై జీరో అవర్‌లో ఎందుకు మాట్లాడలేదని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనేక మంది బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్‌కు ప్రజలు రెండో సారీ అధికారం ఇచ్చారని, ఆ కుటుంబం రాష్ట్రాన్ని ముంచిందని అన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తామని విర్రవీగిన ఆ కుటుంబానికి ప్రజలు ఓట్లుతో బుద్ధి చెప్పారన్నారు. అయినా వారిలో మార్పు రాకపోవడంతో కేటీఆర్ మతి భ్రమించినట్లు మాట్లాడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన వాఖ్యలను ఖండించారు. సిరిసిల్ల ప్రాంతానికి పట్టిన దౌర్భాగ్యం తుపాకీ రాముడు ఎమ్మెల్యే కావడమేనన్నారు. సిరిసిల్లను అభివృద్ధి చేశానని ప్రకటించడం కాదని, ఎక్కడ చేశావో ప్రజలు గుర్తించారని అన్నారు.పట్టణంలో ఎక్కడా అండర్‌గ్రౌండ్ మురికి కాలువలను నిర్మించలేదన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో దళితుల భూములను లాక్కొని వారిని మోసం చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరల పేరుతో కాటన్ వస్త్ర పరిశ్రమల ఉపాధి మార్గాలను లేకుండా చేసింది నీవు కాదా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో కేటీఆర్ అరుచరులు ప్రజలను భయంభ్రాంతులకు గురిచేస్తున్నా ఎందుకు స్పందించడం లేదన్నారు. బతుకమ్మ చీరల బకాయిలపై ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 9, 12 పనులను కావాలనే నిర్లక్ష్యం చేశారని, నీళ్లు లేక పంటలు ఎండి పోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కేటీఆర్ తన పదజాలన్ని మార్చుకోవాలని, ఎమ్మెల్యేగా సిరిసిల్ల ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, నాయకులు గడ్డం నర్సయ్య, యెల్లే లక్ష్మీనారాయణ, వైద్య శివప్రసాద్, ఆకునూరి బాలరాజు, మ్యాన ప్రసాద్, గోలి వెంకటరమణ, ప్రశాంత్‌గౌడ్, మంగ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కేకే మహేందర్‌రెడ్డి పార్టీ కండువాలుకప్పి ఆహ్వానించారు. పెద్దూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మంగ కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షుడ మంగ ప్రశాంత్, పట్టణ ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల తిరుపతి, యూత్ అధ్యక్షుడు నీరటి శ్యాం, సలేంద్రి వేణుగోపాల్ అధ్వర్యంలో గ్రామానికి చెందిన మినప శ్రీనివాస్, దేవయ్య, బడుగు లింగం, సుంచు దేవయ్య, బడుగు లింగయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అదిపెల్లి నాగరాజుగౌడ్, ఆతికం నర్సయ్యగౌడ్, ర్యాకం అనిల్‌కుమార్, బడుగు భరత్‌తదితరులు పాల్గొన్నారు.